క్లుప్తంగా

ముక్కొల్లు పాఠశాలలో ఎంఈఓ తనిఖీలు

గూడూరు: ముక్కొల్లు ప్రాథమిక పాఠశాలలో ఎంఈఓ-2 సీహెచ్ సుబ్రహ్మణ్యం బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో 18 మంది విద్యార్థులు ఉండగా అందరికీ జగనన్న విద్యా కానుక కిట్లు అందాయా లేదా అని ఆరా తీశారు. అందరూ యూనిఫాంలో ఉండటంపై సంతృప్తి వ్యక్తం చేశారు. మధ్యాహ్న భోజనం నాణ్యతగా ఉండేలా ఎప్పటికప్పుడు సమీక్షిస్తుండాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఎంపీటీసీ సభ్యుడు వై. శ్రీనివాసరావు, హెచ్‌ఎం చంద్రశేఖర్, సీఆర్పీ సుబాని తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో అన్నదానం



నాగాయలంక: స్థానిక వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానం ప్రాంగణంలో నిత్యాన్నదాన కమిటీ ఆధ్వర్యంలో బుధవారం వృద్ధులు, దివ్యాంగులకు అన్నదానం చేశారు. దాతలు గ్రామానికి చెందిన జగదీష్, జలంధర్, చెన్ను రంగారావు ఆర్థిక సహకారం అందించారు. రాచంశెట్టి పాపారావు, పొన్నపల్లి చిన్నా పర్యవేక్షణలో మామిడి దామోదరరావు, సబ్బినేని రాణి, మత్తి శేషుబాబు, పొన్నూరు ప్రసాద్ సేవలందించారు.

విద్యార్థినులకు యూనిఫాం పంపిణీ



గూడూరు: మల్లవోలు జెడ్పీ హైస్కూల్ ప్లస్ ఇంటర్మీడియట్ కళాశాల విద్యార్థినులకు బుధవారం యూనిఫాం పంపిణీ చేశారు. పాఠశాల పేరెంట్స్ కమిటీ వైస్ చైర్మన్ గోవాడ ప్రశాంతి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆర్బీకే చైర్మన్ పర్ణం పెదబాబు, హెచ్‌ఎం అరుణ, పీఈటీ హనుమంతరావు కళాశాలలో మొదటి, ద్వితీయ సంవత్సరం చదువుతున్న 20 మంది విద్యార్థినులకు దుస్తులు అందించారు.

పెన్షనర్ల వితరణ



మచిలీపట్నంటౌన్: 41వ డివిజన్‌కు చెందిన వృద్ధాప్య పింఛనుదారు కలిదిండి అనసూర్య ఇటీవల మృతిచెందింది. డివిజన్‌లోని వైఎస్సార్ సామాజిక పింఛన్లు పొందుతున్న లబ్ధిదారులు ఒక్కొక్కరు రూ. 100 చొప్పున సేకరించిన రూ. 28 వేలను డెప్యూటీ మేయర్ లంకా సూరిబాబు ఆధ్వర్యంలో మృతురాలి కుటుంబ సభ్యులకు బుధవారం అందజేశారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

వలంటీర్లు బాధ్యతగా వ్యవహరించాలి

ఎంపీడీఓ రామలింగేశ్వరరావు

మోపిదేవి: ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా పనిచేసే వలంటీర్లు బాధ్యతగా వ్యవహరించాలని ఎంపీడీఓ రామలింగేశ్వరరావు అన్నారు. మోపిదేవి గ్రామ సచివాలయం-1 వద్ద బుధవారం వలంటీర్ల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించి అర్హులైన వారితో దరఖాస్తులు చేయించాలని చెప్పారు. అర్హత ఉన్న ఏ ఒక్కరూ ప్రభుత్వ పథకాలకు దూరం కాకూడదని జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నామని వివరించారు. వలంటీర్లకు పలు సూచనలు చేశారు. ఎంపీపీ రావి దుర్గావాణి, సర్పంచ్ నందిగం మేరీరాణి, ఈఓపీఆర్డీ అరుణకుమారి, గ్రామ కార్యదర్శి త్రిపుర సుందరి, వలంటీర్లు పాల్గొన్నారు.

నేడు మండల పరిషత్ సమావేశం

బంటుమిల్లి: బంటుమిల్లి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం గురువారం ఎంపీపీ వి. చినబాబు అధ్యక్షతన మండల పరిషత్ కార్యాలయంలో జరుగుతుందని ఎంపీడీఓ జె. స్వర్ణభారతి తెలిపారు. ఉదయం 11 గంటలకు జరిగే సమావేశంలో ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొనాలని కోరారు. అధికారులు శాఖాపరమైన సమాచారంతో సమావేశానికి హాజరుకావాలని చెప్పారు.

రేపు శాకంబరి మహోత్సవం

భావదేవరపల్లి(నాగాయలంక): ఆషాఢ మాసంను పురస్కరించుకుని గ్రామంలోని అన్నపూర్ణాదేవి సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం శాకంబరి మహోత్సవం నిర్వహిస్తామని ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త పూషడపు నిరంజనరావు బుధవారం తెలిపారు. అర్చకుడు శ్రీహరి శాస్త్రి నేతృత్వంలో మహిళల సహకారంతో కూరగాయలు, ఆకుకూరలు, పండ్లతో అమ్మవారిని అలంకరించి పూజలు నిర్వహిస్తామని చెప్పారు.

సంక్షేమ పథకాలతో ఆర్థిక పరిపుష్టి

- ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు
- కొనసాగుతున్న జగనన్న సురక్ష ఉచిత సేవలు



మోపిదేవిలో లబ్ధిదారుకు సర్టిఫికెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే రమేష్‌బాబు



మల్లేశ్వరంలో ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న ఎంపీపీ



జింజేరులో ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న ఎంపీపీ వాణి

మోపిదేవి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలు ఆర్థిక పరిపుష్టి సాధిస్తున్నారని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. మోపిదేవి సచివాలయం-1 వద్ద సర్పంచ్ నందిగం మేరీరాణి అధ్యక్షతన బుధవారం జగనన్న సురక్ష శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు 130 సర్టిఫికెట్లను ఎమ్మెల్యే రమేష్‌బాబు చేతుల మీదుగా అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సమస్యలు తెలుసుకుని వారి గ్రామంలోనే పరిష్కరించేందుకు జగనన్న సురక్ష కార్యక్రమం చేపట్టిందన్నారు. సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థను ప్రవేశపెట్టి ప్రభుత్వ పాలనను ప్రజల వద్దకే చేర్చిన ఘనత జగనన్నదే అని చెప్పారు. విద్య, ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తూ గ్రామాల్లో వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటు చేసి ఇంటింటా వైద్యం అందిస్తున్నారని, నాడు-నేడు ద్వారా పాఠశాలల్లో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చి కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ఇంగ్లిష్ మీడియం కూడా ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. ప్రతిపక్షాలు విమర్శించడానికి ఏమీలేక ప్రభుత్వంపై అసత్య ఆరోపణలు చేస్తున్నాయన్నారు. వలంటీర్లు తమ పరిధిలో లబ్ధిదారులకు అందుతున్న పథకాలను వివరించి వారి విమర్శలను తిప్పికొట్టాలని సూచించారు. ఇలాంటి సంక్షేమ పథకాలు పేదలకు పూర్తిగా అందాలంటే మరోసారి జగనన్నను దీవించాలని కోరారు. ఏఎంసీ చైర్మన్ కొక్కిలిగడ్డ వీర వెంకటేశ్వరరావు, ఎంపీపీ రావి దుర్గావాణి, పీఏసీఎస్ చైర్‌పర్సన్ రావి రాంప్రసాద్, లింగం జగదీష్‌కుమార్, తహసీల్దార్ కె. నవీన్‌కుమార్, ఎంపీడీఓ రామలింగేశ్వరరావు, ఈఓపీఆర్డీ అరుణకుమారి పాల్గొన్నారు.

234 సర్టిఫికెట్ల పంపిణీ..

బంటుమిల్లి: కంచడం, మల్లేశ్వరం గ్రామాల్లో బుధవారం నిర్వహించిన జగనన్న సురక్ష శిబిరంలో 234 సర్టిఫికెట్లు అందజేశామని తహసీల్దార్ సత్యనారాయణమూర్తి, ఎంపీడీఓ జె. స్వర్ణభారతి అన్నారు. ఎంపీపీ వి. చినబాబు మాట్లాడుతూ కంచడం గ్రామంలో 62, మల్లేశ్వరంలో 172 సర్టిఫికెట్లను లబ్ధిదారులకు అందజేశామని తెలిపారు. మండల ప్రత్యేకాధికారి, ఏఎంసీ ఏడీ నిత్యానందం, కంచడం, బల్లిపాడు సర్పంచ్‌లు బి. చంద్రశేఖర్, జె. వెంకటేశ్వరరావు, కంచడం, మల్లేశ్వరం ఎంపీటీసీలు పి. భగవాన్, పి. వీరబాబు, కంచడం సొసైటీ అధ్యక్షుడు జి. శేషగిరి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఎం. రాజబాబు పాల్గొన్నారు.

అర్హులకు మేలు చేసేందుకే..

పెడన: సంక్షేమ పథకాలకు, ధ్రువీకరణ పత్రాలు పొందడానికి అర్హులకు మేలు చేసేందుకే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహిస్తోందని ఎంపీపీ రాజులపాటి వాణి అన్నారు. జింజేరు గ్రామ సచివాలయంలో జగనన్న సురక్ష క్యాంపు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా 88 మందికి కులం, ఆదాయ ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. మొత్తం 128 మందికి టోకెన్లు ఇవ్వగా వీటిల్లో 44 కుల ధ్రువీకరణ పత్రాలు, 44 ఆదాయ ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. 40 మంది ఆధార్‌కు ఫోన్ నెంబరు అనుసంధానం చేశారు. మాజీ ఎంపీపీ రాజులపాటి అచ్యుతరావు, వైఎస్సార్ సీపీ నాయకుడు గరికిపాటి వెంకట రామానాయుడు, సర్పంచ్‌లు సీహెచ్ నరసింహస్వామి, వేముల సత్యనారాయణ, ఎంపీటీసీ బొల్లా ఉదయకుమార్, ఎంపీడీఓ రెడ్డయ్య, డీటీ కె. పూర్ణచంద్రరావు, ఈఓపీఆర్డీ జయరాము, సచివాయల ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

గుల్లలమోదలో 535, గణపేశ్వరంలో 552 సర్టిఫికెట్ల పంపిణీ

నాగాయలంక: ప్రజలు మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనను కోరుకుంటున్నారని జెడ్పీటీసీ సభ్యుడు మోకా బుచ్చిబాబు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు భాగాది వెంకట శేషగిరిరావు అన్నారు. గణపేశ్వరం, గుల్లలమోద సచివాలయాల వద్ద బుధవారం జగనన్న సురక్ష క్యాంపులు నిర్వహించారు. వారు మాట్లాడుతూ వలంటీర్ల సర్వే అనంతరం 11 రకాల సేవలకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాల జారీకి ప్రణాళిక రూపొందించామన్నారు. ఆయా సచివాలయాల పరిధిలో ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలను వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులు, అధికారుల చేతుల మీదుగా లబ్ధిదారులకు అందజేశారు. గుల్లలమోదలో మొత్తం 535 పత్రాలను, గణపేశ్వరంలో మొత్తం 552 పత్రాలను అందజేశారు. గణపేశ్వరంలో టీమ్-1 బృందం ఎంపీడీఓ శ్రీనివాసరావు, డీటీ ఈ.నిరీష, ఎంఈఓ-2 అన్నపరెడ్డి రామారావు, గుల్లలమోదలో టీమ్-2 బృందం తహసీల్దార్ జె.విమల కుమారి, ఈఓపీఆర్డీ కె.అప్పలనరసమ్మ, ఆర్ఐ ఎన్.నంద గీతసారథి ఆధ్వర్యంలో క్యాంపులు జరిగాయి. సర్పంచి బెల్లంకొండ శ్రీనివాసరావు, నియోజకవర్గ సచివాలయాల కన్వీనర్ మద్ది వెంకట నారాయణ పాల్గొన్నారు.

పథకాలందని వారుంటే దరఖాస్తు చేసుకోవాలి..

జగనన్న సురక్షలో వలంటీర్లు ఇంటింటికి వస్తున్నారని, సంక్షేమ పథకాలకు అర్హులై ఉంటే వాటికి తప్పకుండా దరఖాస్తు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ బి. మహేంద్ర అన్నారు. బుధవారం పట్టణంలోని మూడో సచివాలయం పరిధిలోని 7, 8, 9, 10వ వార్డులకు సంబంధించి జగనన్న సురక్ష క్యాంపు వీరభద్రపురంలోని కర్లబత్తువారి కల్యాణ మండలంలో నిర్వహించారు. మున్సిపల్ ఇన్‌చార్జి చైర్మన్ ఎండీ ఖాజా, ఆయా వార్డుల కౌన్సిలర్లు కటకం నాగకుమారి, కటకం ప్రసాద్, గరికిముక్కు చంద్రబాబు, వైస్ చైర్మన్ బైలపాటి జ్యోతి పాల్గొని ధ్రువీకరణ పత్రాలు అందజేశారు.

175 ధ్రువీకరణ పత్రాలు పంపిణీ..

చల్లపల్లి: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జగనన్న సురక్ష కార్యక్రమ వేదికపై దరఖాస్తుదారులకు సత్వరమే ఉచిత సర్టిఫికెట్లు అందించామని తహసీల్దార్ కె.గోపాలకృష్ణ తెలిపారు. బుధవారం స్థానిక చల్లపల్లి గ్రామ సచివాలయం-2 కార్యాలయం వద్ద జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. పదకొండు రకాల ఉచిత సర్టిఫికెట్ల కోసం 175 మంది దరఖాస్తు చేసుకోగా 175 సర్టిఫికెట్లు తహసీల్దార్ అందజేశారు. పీఏసీఎస్ చైర్మన్ పాగోలు నాగ సీతా రామారావు (ఫణి), పంచాయతీ ఈఓ పేర్ని మాధవేంద్రరావు, జేసీఎస్ మండల కన్వీనర్ యడ్ల జగదీష్, గ్రామ సచివాలయ కన్వీనర్లు అర్షద్, సమీర్, సతీష్, మోహనరంగా పాల్గొన్నారు.

ఇబ్బందులు తొలగించేందుకే..

ఘంటసాల(అవనిగడ్డ): ప్రజలు సర్టిఫికెట్ల కోసం ఇబ్బందులు పడకుండా ఉండేందుకు, డబ్బులు, సమయాన్ని ఆదా చేసుకునేందుకే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. ఘంటసాలలో బుధవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 1, 2 సచివాలయాల పరిధిలో 432 సర్టిఫికెట్లను అందజేశారు. డీపీఓ నాగేశ్వర నాయక్, ఎంపీపీ వేమూరి రజనీకుమారి, ఏఎంసీ చైర్మన్ వేమూరి వెంకట్రావ్, జెడ్పీటీసీ తుమ్మల మురళీకృష్ణ, అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

అవనిగడ్డలో..

స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో జగన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు మాట్లాడుతూ ప్రజలకు ఎంతో ఉపయోగకరమైన ఈ కార్యక్రమంపై విస్తృత ప్రచారం చేయాలన్నారు. అనంతరం లబ్ధిదారులకు సర్టిఫికెట్లను అందించారు. ఏఎంసీ చైర్మన్ కొక్కిలిగడ్డ వీర వెంకటేశ్వరరావు, ఎంపీపీ తుంగల సుమతీదేవి, జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, సర్పంచ్ గొరుముచ్చు ఉమా, సూపరింటెండెంట్ అతావుల్లా, షేక్ నజీర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

విజయవంతం చేయండి..

గూడూరు: జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో సచివాలయ సిబ్బంది, వలంటీర్లు కీలక పాత్ర పోషించాలని గూడూరు ఎంపీపీ సంగా మధుసూదనరావు అన్నారు. గూడూరు మండల పరిషత్ కార్యాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమంపై సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో సమీక్షా సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. జెడ్పీటీసీ సభ్యుడు వేముల సురేష్ రంగబాబు మాట్లాడుతూ జగనన్న సురక్ష సేవలను అర్హులైన వారు సద్వినియోగం చేసుకునేలా చొరవ తీసుకోవాలని కోరారు. పీఏసీఎస్ చైర్మన్ తలుపుల వెంకట కృష్ణారావు, వైఎస్సార్ సీపీ నాయకులు గొరిపర్తి రవికుమార్, కనపర్తి రాజు పాల్గొన్నారు.

విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు



అమ్మ ఒడి చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు

ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు

అవనిగడ్డ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. స్థానిక కోర్టు సెంటర్‌లోని ఎన్‌జీఓ దివి యూనిట్ భవనంలో అమ్మ ఒడి లబ్ధిదారులకు బుధవారం ఎమ్మెల్యే సింహాద్రి చెక్కు అందజేసి మాట్లాడారు. ఆర్థిక ఇబ్బందుల వల్ల పేద పిల్లలు చదువుకు దూరం కాకూడదని, విద్య ద్వారా ప్రయోజకులను చేసేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమ్మ ఒడి వంటి అద్భుత పథకాన్ని తీసుకు వచ్చారని చెప్పారు. అంతర్జాతీయ స్థాయిలో పేద విద్యార్థులు పోటీ పడేందుకు ఇంగ్లిష్ మీడియం, బైజూస్, ట్యాబ్‌లు అందజేత కార్యక్రమాన్ని సీఎం జగన్ చేపట్టారన్నారు. నాడు-నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా తీర్చిదిద్దారన్నారు. అవనిగడ్డ మండలంలో నాలుగు విడతలుగా 11,287 మంది విద్యార్థుల తల్లుల ఖాతాలకు రూ.19.87 కోట్లు అమ్మ ఒడి ద్వారా జమ చేశారని వివరించారు. మేలు జరిగితేనే ఓటు వేయమని దమ్ముగా అడుగుతున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. జగన్ గెలిస్తే పేదలు గెలిచినట్టేనని, మరొకసారి అధికారాన్ని ఇస్తే మరిన్ని మంచి పథకాలు తీసుకొస్తారని ఎమ్మెల్యే సింహాద్రి చెప్పారు. ఏఎంసీ చైర్మన్ కొక్కిలిగడ్డ వీర వెంకటేశ్వరరావు, ఎంపీపీ తుంగల సుమతీదేవి, జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, సర్పంచ్ గొరుముచ్చు ఉమా, తహసీల్దార్ రామకృష్ణ, సింహాద్రి వెంకటేశ్వరరావు, నాయకులు పాల్గొన్నారు.

ఖరీఫ్ సాగుకు వేళాయె..



కృత్తివెన్ను మండలం చిన్నగట్టు వద్ద నారుమడి కోసం విత్తనాలు చల్లుతున్న రైతులు



లంకలకలువగుంటలో కళకళలాడుతున్న వరి నారుమడి



పెడన మండలం కూడూరు ప్రాంతంలో వరి విత్తనాలు చల్లుతున్న రైతులు

- అనుకూల వాతావరణంతో ఆనందం
- నారుమడులు సిద్ధం చేసుకుంటున్న రైతులు
- నిండు కుండలా పంట కాలువలు

కృత్తివెన్ను/పెడన: అరక పట్టి మెరక దున్ని చదును చేసిన రైతులు విత్తనాలు చల్లి ఖరీఫ్ సాగుకు సమాయత్తమవుతున్నారు. ఒక వైపు వాతావరణం చల్లబడి అనుకూలంగా వర్షాలు కురవడం.. మరోవైపు పుష్కలంగా సాగునీటితో పంట కాలువలు నిండు కుండను తలపిస్తుండగా రైతుల మోములో సంతోషం వెల్లివిరుస్తోంది. శివారు ప్రాంతమైన కృత్తివెన్ను మండలంలో రైతులు ఈ ఏడాది ఖరీఫ్ సాగు కోసం నారుమడులు సిద్ధం చేసుకుంటున్నారు. మండల వ్యాప్తంగా ఈ ఖరీఫ్‌లో సుమారు 4,500 ఎకరాలు సాగు చేస్తారని వ్యవసాయ శాఖాధికారి జెన్నీ తెలిపారు. ఈ ఖరీఫ్‌కు గాను రైతులు తమ పొలాలలో ప్రభుత్వం సిఫారసు చేసిన ఎంటీయూ 1318, 1140, 1172, 1224, 1202, 1190, 1121, 7029 (స్వర్ణ), బీపీటీ 5204, 2782, 2595, ఎంసీఎం 100, 101, 109, 125 రకాలను వేసుకోవచ్చుని ఆమె సూచించారు. పెడన మండలంలో కురుస్తున్న వర్షాలు, కాలువల ద్వారా వస్తున్న సాగునీరుతో రైతుల్లో హర్షం వ్యక్తమవుతోంది. కొందరు వాతావరణ పరిస్థితులను చూసి అనుకూలంగా ఉందని విత్తనాలను జల్లుతుంటే.. మరికొందరు ఇప్పటికే వెదసాగు చేపట్టారు.

మరికొందరు నీరు అధికంగా ఉండటంతో నిలిచిన నీటికి బయటకు పంపించే ఏర్పాట్లు చేసుకుంటున్నారు. అక్కడక్కడా నారుమళ్లు వేశారు. పెడన మండలంలో 9,300 హెక్టార్లలో వరి సాగు అవుతోంది. ఇందులో 90 శాతం వెదసాగు చేయడం విశేషం.

ప్రతి పథకం పేదల కోసమే

పేర్ని కిట్టు



పథకాల లబ్ధిని వివరిస్తున్న పేర్ని కిట్టు

కోనేరుసెంటర్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన ప్రతి పథకం పేద ప్రజల కోసమేనని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కిట్టు అన్నారు. పెదయాదర గ్రామంలో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలపై గ్రామస్తులకు కిట్టు అవగాహన కల్పించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందుతున్నదీ, లేనిదీ అడిగి తెలుసుకున్నారు. గ్రామానికి చెందిన అర్జా అనసూయాదేవి మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత గ్రామంలోని అనేక సమస్యలకు పరిష్కారం లభించిందని, ముఖ్యంగా తమ కుటుంబానికి ప్రభుత్వపరంగా లబ్ధి చేకూరిందని చెప్పారు. ఇదంతా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చలువేనని ఆనందం వ్యక్తం చేసింది. జగనన్నకు మా కుటుంబం ఎంతగానో రుణపడి ఉంటుందని చెప్పింది. అదే గ్రామానికి చెందిన రైతు కంచర్లపల్లి నాగేశ్వరరావు మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వం చేయని ఆర్థిక సహాయాన్ని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేసిందన్నారు. మా కుటుంబానికి దాదాపు నాలుగు లక్షల పైచిలుకు వివిధ పథకాల రూపంలో లబ్ధి చేకూరిందని తెలిపాడు. కిట్టు మాట్లాడుతూ పేదలు ఆర్థికంగా బలోపేతం కావాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమన్నారు. ఆ దిశగా పేదల కోసం ఆయన అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి వాటిని అమలు చేస్తున్నారని వివరించారు. మాజీ సర్పంచ్ కంచర్లపల్లి విజయ సారథి, వైఎస్సార్ సీపీ నాయకులు అర్జా కిరణ్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

సబ్సిడీపై కూరగాయ విత్తనాలు, యంత్ర పరికరాలు

ఉద్యాన శాఖాధికారి నల్లగట్ల రమేష్



మాట్లాడుతున్న ఉద్యానశాఖాధికారి రమేష్

నాగాయితిప్ప(మోపిదేవి): రాష్ట్ర ప్రభుత్వం కూరగాయలు పండించే రైతులకు సబ్సిడీపై విత్తనాలు, యంత్ర పరికరాలు అందిస్తోందని అవనిగడ్డ ఉద్యాన శాఖాధికారి నల్లగట్ల రమేష్ అన్నారు. నాగాయితిప్ప సచివాలయంలో సర్పంచ్ గరికిపాటి వెంకటేశ్వరరావు (బుల్లి) అధ్యక్షతన బుధవారం రైతులతో సమావేశం నిర్వహించారు. ఉద్యాన శాఖాధికారి రమేష్ మాట్లాడుతూ కూరగాయ తోటలు వేసిన రైతులకు సబ్సిడీ విత్తనాలను హెక్టారుకు రూ. 3 వేలు, మల్చింగ్ నిమిత్తం హెక్టారుకు రూ. 16 వేల చొప్పున అందిస్తామన్నారు. హైబ్రిడ్ విత్తనాల సాగులో రైతులను ప్రోత్సహించేందుకు హెక్టారుకు రూ. 20 వేలు అందిస్తామన్నారు. ఏపీఎంఐపీ ద్వారా రైతులకు కావలసిన బిందు, తుంపర్ల సేద్యంకు అవకాశం ఉందని చెప్పారు. బిందు సేద్యంకు ఐదు ఎకరాల వరకు 90 శాతం సబ్సిడీ ఉందని, 5 నుంచి 10 ఎకరాల వరకు 50 శాతం సబ్సిడీపై అందిస్తామన్నారు. తుంపర్ల సేద్యంకు 5 ఎకరాల లోపు 55 శాతం, 5 నుంచి 10 ఎకరాల లోపు 45 శాతం సబ్సిడీ ఉందన్నారు. యంత్ర పరికరాలపై 20 హెచ్‌పీ సామర్థ్యం కలిగిన ట్రాక్టర్‌కు ఒక లక్ష సబ్సిడీ ఉందని, త్రైవాన్ స్ప్రేయర్, రోటోవేటర్, పవర్‌వీడర్‌పై 50 శాతం సబ్సిడీ ఉందని, అవసరమైన రైతులు సమీపంలోని రైతు భరోసా కేంద్రం, వ్యవసాయ, ఉద్యాన శాఖ సహాయకులను సంప్రదించాలని సూచించారు. పీఏసీఎస్ చైర్‌పర్సన్ గరికిపాటి గోవిందరాజులు, లింగం జగదీష్ కుమార్, ఉద్యాన శాఖ మండల సహాయకులు బాలాజీ, పలువురు రైతులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఎద్దుకు తీవ్ర గాయాలు



పురిటిగడ్డ(చల్లపల్లి): చల్లపల్లి-నడకుదురు ప్రధాన రహదారిపై పురిటిగడ్డ వద్ద బుధవారం టిప్పర్ లారీ ఎద్దును ఢీకొట్టింది. ఇసుక లోడుతో వెళుతున్న టిప్పర్ లారీ ఎదురుగా వెళుతున్న ఎడ్లబండిని దాటే క్రమంతో ఈ ఘటన జరిగింది. టిప్పర్ డ్రైవర్ సడన్‌గా కట్ చేసి ఎడ్లబండి ముందుకు వచ్చే క్రమంలో టిప్పర్ చక్రం ఎద్దు కాలిపై ఎక్కింది. ఈ ఘటనలో ఎద్దు కింద పడిపోగా స్థానికులు సహాయక చర్యలు అందించారు. ఎద్దు కాలికి తీవ్ర రక్తస్రావం కావడంతో పశువైద్య సిబ్బంది చికిత్స అందించారు. సింగిల్ రోడ్డుపై టిప్పర్ల వేగాన్ని పోలీసులు నియంత్రించాలని వాహనదారులు కోరుతున్నారు.

రైతుబజారులో సబ్సిడీ టమాటాల విక్రయం



పెడన: రైతు బజారులో 50 శాతం సబ్సిడీపై టమాటాలను అందజేస్తున్నామని పెడన రైతు బజారు ఎస్టేట్ ఇన్‌చార్జి అధికారి అమీద్ అన్నారు. బుధవారం వినియోగదారులకు సబ్సిడీపై టమాటాలను అందజేసి మాట్లాడారు. రైతుబజారుకు వచ్చే వినియోగదారులకు సబ్సిడిపై కిలో రూ. 50లకే విక్రయిస్తున్నామని చెప్పారు.

- చల్లపల్లి: వ్యవసాయ మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో స్థానిక రైతుబజారులో సబ్సిడీపై టమాటా విక్రయాలు ప్రారంభించారు. బుధవారం ఉదయం ఒక్కొక్కరికి కిలో రూ.50 చొప్పున విక్రయించారు. చల్లపల్లి రైతు బజారు ఎస్టేట్ అధికారి బలి చక్రవర్తి, యోహాను పర్యవేక్షించారు.

కాలువలో వ్యర్థాల తొలగింపు



కోడూరు: పంట కాలువల్లో పేరుకుపోయిన వ్యర్థాలను ఇరిగేషన్ అధికారులు యంత్రాల సహాయంతో తొలగింపు చర్యలు చేపట్టారు. రామకృష్ణాపురం, ఊటగుండం, ఇరాలి, బసవానిపాలెం గ్రామాలకు వెళ్లే 14వ నంబర్ పంటకాలువలో మూడు రోజుల నుంచి జేసీబీ సహాయంతో పనులు నిర్వహిస్తున్నారు. కాలువ కింద భాగంలో ఉన్న మురుగు, సిల్ట్, వివిధ రకాల వ్యర్థాలను తొలగిస్తున్నారు. పంట పొలాలకు పుష్కలంగా సాగునీటిని అందివ్వనున్నట్లు ఇరిగేషన్ డీఈ సత్యసాయి ప్రకాష్ తెలిపారు.

నేడు పెంపుడు కుక్కలకు ఉచితంగా వ్యాక్సిన్

పెడన: జూనోసిస్ డే సందర్భంగా గురువారం పెంపుడు కుక్కలకు రేబిస్ వ్యాక్సిన్ ఉచితంగా వేస్తామని పశుసంవర్థక శాఖ పెడన అసిస్టెంట్ డైరెక్టర్ కొనకళ్ల బాబూరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పెడన, బంటుమిల్లి, గూడూరు, కృత్తివెన్ను మండలాల్లోని అన్ని పశు వైద్యశాలల్లో వ్యాక్సిన్ వేస్తారన్నారు. పెంపుడు కుక్కలున్న వారు తమతో పాటు ఆధార్ కార్డు తెచ్చుకుంటే సరిపోతుందని, ఆధార్ నెంబరు, పేరు నమోదు చేసుకున్న తరువాత సదరు పెంపుడు కుక్కకు టీకా వేస్తారని వివరించారు. పెడనలోని ఏడీ ఆస్పత్రిలో ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు టీకా వేస్తారని చెప్పారు.

మచిలీపట్నంటౌన్: ప్రపంచ జూనోసిస్ డే సందర్భంగా జిల్లాలోని పశువుల ఆస్పత్రుల్లో యాంటీ రేబిస్ వ్యాక్సిన్‌ను కుక్కలకు ఉచితంగా వేస్తామని జిల్లా పశు సంవర్ధక శాఖాధికారి ఎంఎస్ దివాకర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మచిలీపట్నంలో రైతుబజారు పక్కన ఉన్న పశువుల ఆస్పత్రిలో ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు యాంటీ రేబిస్ వ్యాక్సిన్‌ను ఉచితంగా వేస్తామని వివరించారు.

బంటుమిల్లి: జూనోసిస్ డే సందర్భంగా పెంపుడు కుక్కలకు ఉచితంగా యాంటి రేబిస్ వ్యాక్సిన్లు వేస్తామని పశు వైద్యాధికారి స్ఫూర్తి తెలిపారు. పెంపుడు కుక్కలున్న యజమానులు వాటిని తీసుకుని బంటుమిల్లి, అర్తమూరు, పెదతుమ్మిడి ఆస్పత్రుల వద్దకు యజమాని ఆధార్, ఫోన్ నెంబర్లతో రావాలని చెప్పారు.

నేడు చిన్నాపురంలో 'జగనన్న సురక్ష'

కోనేరుసెంటర్: చిన్నాపురం గ్రామంలో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తామని బందరు తహసీల్దార్ ఎం. శ్రీవిద్య తెలిపారు. ఉదయం 10 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు గ్రామ సచివాలయంలో నిర్వహించే ఈ కార్యక్రమంలో 11 రకాల సేవలకు సంబంధించి ధ్రువీకరణ పత్రాలు అందిస్తామని చెప్పారు.

అందుబాటులో డీఏపీ

పామర్రు: డీఏపీ ఎరువు అందుబాటులో ఉందని, రైతులు వినియోగించుకోవాలని పామర్రు ఏఓ శివ నాగమణి అన్నారు. స్థానిక రైతు భరోసా కేంద్రం-3 వద్ద రైతులకు డీఏపీ ఎరువులను బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కియోస్క్ మిషన్ ద్వారా ఆద్వాన్సుగా బుక్ చేసుకున్న వారికి ఎరువులు వచ్చాయని అన్నారు. ప్రస్తుతం 20 టన్నుల డీఏపీ అందుబాటులో ఉందని తెలిపారు. ఎరువులను అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌లో స్వచ్ఛత నిర్ధారణ పరీక్షలు జరిగిన తర్వాత రైతులకు అందిస్తామన్నారు. అరుమళ్ల శివనాగిరెడ్డి, వీఏఏ కిరణ్, రైతులు పాల్గొన్నారు.

సాక్షి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

మచిలీపట్నం డివిజన్

99122 20543 (మచిలీపట్నం, పెడన)

79955 66983, 99122 20545 (అవనిగడ్డ)

Office mail : sakshiads@gmail.com